నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
3 | గురువారం 15 ఆగస్టు 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

# వైద్యులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటాం

**జిల్లా ప్రభుత్వ జనరల్ దవాఖాన సూపరింటెండెంట్ హరిశ్చంద్రారెడ్డి**

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 14: మంచిర్యాల జిల్లా ప్రభుత్వ జనరల్ దవాఖానలో రోగులకు అందుతున్న వైద్యం పై 'నమస్తే తెలంగాణ' 'వైద్యులున్నా అందని వైద్యం' అనే శీర్షికతో కథనాన్ని ప్రచురించింది. ఈ మేరకు దవాఖాన సూపరింటెండెంట్ హరిశ్చంద్రారెడ్డి స్పందించారు. ఉదయం జనరల్ మెడిసిన్ ఓపీలో డాక్టర్ ఉదయం 9.30 గంటల వరకు రాక పోవడం, జనరల్ మెడిసిన్ సెకండ్ యూనిట్‌లో ఉన్న ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లలో ఒకరు సెలవులో ఉండడం, ఇంకొకరు వార్డులో రౌండ్స్‌లో ఉండడంతో కొంత సమన్వయ లోపంతో ఓపీలో వైద్యుల ఉండని పరిస్థితులు ఎదురైనట్లు తెలిపారు. వెంటనే ఫిజీషియన్‌ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ విషయాన్ని సంబంధిత వైద్యాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని వివరణ ఇచ్చారు.

## లక్షెట్టిపేట ప్రభుత్వ దవాఖాన తనిఖీ

లక్షెట్టిపేట,ఆగస్టు 14: లక్షెట్టిపేట ప్రభుత్వ దవాఖానను మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ బుధవారం తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. ఫార్మసీ, ల్యాబ్, వార్డులను తనిఖీ చేశారు. రోగులతో మాట్లాడి అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. రోగులకు వైద్యం అందించడంలో నిర్లక్ష్యం చేయవద్దని, అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని దవాఖాన సూపరింటెండెంట్ శ్రీనివాస్, వైద్యులు పవిత్ర, సురేశ్, సిబ్బందిని ఆదేశించారు.


వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్


ఫ్యాన్లు లేకపోవడంతో ఫైల్ తో గాలి ఊపుకుంటున్న మహిళ పక్కన కలెక్టర్, సూపరింటెండెంట్


కలెక్టర్ కుమార్ దీపక్‌కు సమస్యలను తెలుపుతున్న రోగుల బంధువులు


వాటర్ రావడం లేదని ఆర్‌వో ప్లాంట్‌లో వాటర్ బాటిల్‌తో వాటర్ పట్టి చూపిస్తున్న యువకుడు

'నమస్తే'కు స్పందన

కలెక్టర్‌కు సమస్యలు చెబుతున్న రోగి బంధువు

రిపోర్టులు సరైన సమయానికి రావడం లేదని కలెక్టర్‌కు చెబుతున్న రోగుల బంధువులు


విలేకరులతో మాట్లాడుతున్న మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

# కలెక్టర్ సాక్షిగా.. దవాఖానలో కష్టాలు

**దండం పెడుతాం.. సమస్యలు తీర్చండంటూ రోగుల వేడుకోలు**

- మంచిర్యాల జనరల్ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్
- సమస్యల మీద నిలదీసిన రోగులు.. వారి బంధువులు
- పేషెంట్లకు మెరుగైన చికిత్స అందించేందుకు కృషి : కలెక్టర్ కుమార్ దీపక్
- 'నమస్తే తెలంగాణ' కథనంతో కదిలిన కలెక్టర్, అధికార యంత్రాంగం

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 14 : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై 'నమస్తే తెలంగాణ' బుధవారం 'వైద్యులున్నా.. అందని వైద్యం..' శీర్షికన రోగులు పడుతున్న అవస్థలు, సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చింది. ఈ మేరకు కథనానికి స్పందించిన కలెక్టర్ కుమార్ దీపక్ బుధవారం దవాఖానను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సూపరింటెండెంట్ హరీశ్ చంద్రా రెడ్డితో కలిసి వార్డులను తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందుతున్న సేవలపై ఆరా తీసి, రికార్డులను పరిశీలించారు. అనంతరం రోగులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వైద్య సేవలు అందడం లేదని, వైద్యులు సమయానికి రావడం లేదని, నర్సింగ్ సిబ్బందితో వైద్యం అందిస్తున్నారని, మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా లేదని, వరండాలో మడత మంచాలపై వైద్యం అందిస్తున్నారని, ఆర్‌వో ప్లాంట్ పని చేయకపోవడంతో తాగు నీటిని బయటి నుంచి తెచ్చుకుంటున్నామని, ఫ్యాన్లు లేవని, దోమలతో సహవాసం చేస్తున్నామని, ఉక్కపోతతో కొట్టుమిట్టాడుతున్నామంటూ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు.

### కలెక్టర్‌ను నిలదీసిన రోగి బంధువులు

సమావేశం పూర్తయిన తరువాత మూడో ఫ్లోర్ నుంచి కిందకు దిగుతున్న కలెక్టర్, వైద్యాధికారులను రెండో ఫ్లోర్‌లో ఉన్న రోగులు, వారి బంధువులు కలెక్టర్‌కు అడ్డుగా వెళ్లి సమస్యలపై నిలదీశారు. పక్కనే ఉన్న ఓ యువకుడు వాటర్ బాటిల్ నిండాలంటే కనీసం 20 నుంచి 30 నిమిషాల సమయం పడుతున్నదని కలెక్టర్‌కు చూపించాడు. ఇలా రోగులు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం డయాలసిస్ సెంటర్‌ను సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

### మెరుగైన చికిత్స అందిస్తాం.. :

**మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్**

మంచిర్యాల జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న రోగులకు సరైన వైద్యం అందేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ప్రస్తుతం సీజనల్ జ్వరాల కేసులు ఎక్కువ వస్తున్నాయి. జిల్లాలో ఉన్న నాలుగు సెంటర్ల (జీజీహెచ్, 3 సీహెచ్‌సీ) ద్వారా వైద్య సేవలు అందుతున్నాయి. అన్నింటినీ తనిఖీ చేస్తామన్నారు. ఇందులో భాగంగా బుధవారం జీజీహెచ్ ఆసుపత్రిని పరిశీలించామని పేర్కొన్నారు. రోగులకు సరైన వైద్య సేవలు అందుతున్నాయని తెలిపారు. జ్వరాల కేసులకు ప్రత్యేక వార్డులను ఏర్పాటు చేశామన్నారు. జ్వరాల కేసులు ఎక్కువైతే చర్యలు తీసుకుంటామని తెలిపారు. జనరల్ మెడిసిన్‌కు సంబంధించి ప్రత్యేకంగా వైద్యుడిని ఏర్పాటు చేశామన్నారు. మందుల కొరత ఉన్నప్పటికీ స్థానికంగా కొనుగోలు చేసి అందిస్తున్నామన్నారు. జీజీహెచ్‌కు దాదాపు 25 శాతం ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర నుంచి రోగులు వైద్యం కోసం వస్తున్నారని, రోగి వెంట ఒకరు మాత్రమే రావాలని విజ్ఞప్తి చేశారు. రోగులు, వారి బంధువులు తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడి ప్రత్యేక నిధులను సమకూర్చి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. హరీశ్ చంద్రారెడ్డి మాట్లాడుతూ.. భవనం పాతది కావడంతో కొంత ఇబ్బందులు ఉన్నాయని, దాని ద్వారా రోగులు ఇబ్బందులు పడుతున్నారని, వైద్యులు 24 గంటలు అందుబాటులో ఉండేలా, రోగులకు మందులు అందేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో దవాఖాన ఆర్‌ఎంవోలు భీష్మా, శ్రీమన్నారాయణ, శ్రీధర్ పాల్గొన్నారు.


దవాఖానలోని వార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

## రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి


కాగజ్‌నగర్‌లోని ప్రభుత్వ దవాఖానను తనిఖీ చేస్తున్న ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

కాగజ్‌నగర్, ఆగస్టు 14 : రోగులకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యసేవలందించాలని వైద్యులు, సిబ్బందిని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే ఆదేశించారు. కాగజ్‌నగర్‌లోని ఎల్లాగౌడ్ తోటలోని 30 పడకల సామాజిక దవాఖానను బుధవారం కలెక్టర్ తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ రోగుల వివరాలు, వారికి అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలని, వైద్య సేవలందించడంలో నిర్లక్ష్యం చేయవద్దని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో సీతారాం, డాక్టర్ హారిక, ఫిజియో థెరపీ పౌల్, యూడీసీ అనిల్‌కుమార్, ల్యాబ్ టెక్నీషియన్ దిలిప్, సిబ్బంది శ్రీనివాస్ ఉన్నారు.

### ఫార్మసిస్టుకు షోకాజ్ నోటిస్

దవాఖానలోని మందుల విభాగంలో కలెక్టర్ తనిఖీ చేశారు. అందుబాటులో ఉన్న మందుల వివరాలు తెలుసుకోగా ఆర్‌బీసీ మెడిసిన్ లేదని ఫార్మసిస్టు వెంకటేశ్వర్లు చెప్పడంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే అక్కడే ఉన్న డీఎంహెచ్‌వోతో మాట్లాడి విధులపై నిర్లక్ష్యం వహించినందుకు ఫార్మసిస్టు వెంకటేశ్వర్లుకు షోకాజ్ నోటీసు పంపించారు.

## జిల్లా దవాఖాన నిర్వహణ అధ్వానం

**ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి ఆగ్రహం**

ఆసిఫాబాద్ టౌన్, ఆగస్టు 14 : జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రభుత్వ దవాఖాన నిర్వహణ అధ్వానంగా ఉందని రోగులకు కనీస సౌకర్యాలు కూడా కల్పించడం లేదని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా దవాఖానను మంగళవారం రాత్రి సందర్శించారు. రోగులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాత్రిపూట గర్భిణులు కరెంటు లేక చీకట్లో ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేషెంట్లకు సరిపడా బెడ్లు లేకపోవడం ఏమిటని ప్రశ్నించారు. వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని డిమాండ్ చేశారు.


ఆసిఫాబాద్ ప్రభుత్వ దవాఖానలో రోగితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి


స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా గ్రంథాలయ ఆవరణలో మొక్కలు తొలగిస్తున్న బెల్లంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, కమిషనర్ శ్రీనివాసరావు, సిబ్బంది


పిచ్చిమొక్కలను తొలగించి అక్కడే వదిలేయడంతో పేరుకుపోయిన చెత్త కుప్పలు

# ఫొటోలకు ఫోజులిచ్చారు.. పారిశుధ్యం మరిచారు

బెల్లంపల్లి, ఆగస్టు 14 : స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం బెల్లంపల్లి మున్సిపాలిటీలో ప్రహసనంగా మారింది. ప్రచార ఆర్భాటమే తప్పా ఎక్కడా కూడా పూర్తి స్థాయిలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బెల్లంపల్లిలోని కాళోజీ శాఖ గ్రంథాలయం ఆవరణలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్వహించారు. ఇందులో భాగంగా 5 నిముషాల పాటు పిచ్చి మొక్కలను తొలగించి ఫొటోలు దిగి వెళ్లిపోయారు. పీకేసిన పిచ్చి మొక్కలు, చెత్తను తొలగించకుండా వదిలేశారు. దీంతో గ్రంథాలయ ఆవరణ పిచ్చిమొక్కలతో పాటు చెత్త కుప్పలతో యధావిధిగా దర్శనమిస్తున్నది. మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధుల బాధ్యతారాహిత్యానికి అవి అద్దం పడుతున్నది. ఈ కార్యక్రమానికి ముందే పిచ్చి మొక్కలను తొలగించాలని గ్రంథాలయాధికారి గోపీ మున్సిపల్ కమిషనర్‌కు విన్నవించినా పట్టించుకోలేదు. కనీసం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంతోనైనా శుభ్రం చేస్తారని చూస్తే ఫలితం లేకపోయిందని గ్రంథాలయ పాఠకులు, స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.



















